క్లుప్తంగా

రూ.2.70 లక్షల చెక్కు అందజేత


బాధితురాలికి చెక్కు అందజేస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పాము కాటుకు గురై చికిత్స పొందిన పవర గ్రామానికి చెందిన ఉపాధి కూలీ ఆలపాటి మేరీ సుందరికి ఉపాధి హామీ బీమా పథకం ద్వారా మంజూరైన రూ.2.70 లక్షల చెక్కును రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సోమవారం అందజేశారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో బాధితురాలికి చెక్కు ఇచ్చారు. కార్యక్రమంలో పవర సర్పంచ్ వీరంరెడ్డి సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంపీటీసీ నాగనబోయిన చంటిబాబు, గ్రామ పార్టీ ఇన్‌చార్జి నాగనబోయిన రాజబాబు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లలిత భూషణ్, రవి కిషోర్‌లు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి స్పందనకు 16 అర్జీలు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: వారం వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమానికి సోమవారం ఆయా మండలాల నుంచి 16 అర్జీలు అందినట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. పట్టణ పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న నల్లబూడిద నివారణపై చర్యలు చేపట్టాలని, ఆక్రమణకు గురైన మంగలి మాన్యం భూమిని ఇప్పించాలని, భూమి రీసర్వే చేయాలని తదితర సమస్యలపై 16 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతీ వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారం వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించానని చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, డీటీ భాను కుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, సీడీపీఓ ఉష పాల్గొన్నారు.


ఘనంగా అయ్యప్ప పడిపూజ

పెద్దాపురం: మండలంలోని పులిమేరులో అయ్యప్ప స్వాముల సామూహిక పడిపూజ సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు శర్మ, పెద్దిరెట్టి నూకామణిల ఆధ్వర్యంలో సుమారు 1500 మంది స్వాములు పూజలో భాగస్వాములై లక్షబిల్వార్చన, దీపాలంకరణ, 18 మెట్ల పూజను చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తుమ్మల బాబు, నాని, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

జర్మన్ లాంగ్వేజ్, డోమైన్ స్కిల్స్‌పై శిక్షణ

సామర్లకోట: బీఎస్సీ నర్సింగ్ పాసైన మహిళలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్‌టీయూకేలో 90 రోజుల పాటు జర్మన్ లాంగ్వేజ్ మరియు డొమైన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. 20 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్నవారు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో పాటు శిక్షణ మెటీరియల్, యూనిఫాం అందజేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రతిభ ఆధారంగా నెలకు రూ.లక్ష వరకూ జీతం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 82888 73337, 99630 74879 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

భారీ అన్నదానం


సామర్లకోట రైల్వే పీడబ్ల్యూ కార్యాలయం వద్ద నిర్వహించిన అన్నదానం

సామర్లకోట: స్థానిక కనకదుర్గ ఆలయం సమీపంలోని రైల్వే పీడబ్ల్యూ కార్యాలయం వద్ద రైల్వే ఉద్యోగులు, కార్మికుల సహకారంతో రామసుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పరిధిలోని భక్తులు, రైల్వే ప్రయాణికులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. రైల్వే ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎస్.రామకృష్ణ, ఆలయ కమిటీ నాయకులు బి.రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, ఏపీడబ్ల్యూ సత్యనారాయణలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు 6 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

పెద్దాపురం: మండలంలోని పులిమేరు, మర్లావ గ్రామాల్లో సారా బట్టీలపై దాడులు నిర్వహించి 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఒక వ్యక్తిపై కేజు నమోదు చేసినట్లు ఎస్ఐ వెలుగుల సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.


పాదగయలో దర్శనానికి బారులు తీరిన భక్తులు


గొల్లప్రోలు మండలం దుర్గాడ రామలింగేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు


కొత్తపల్లిలో రాజశేఖర స్వామి ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత రాజశేఖర స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

హరహర మహాదేవ శంభో శంకర

- శివాలయాల్లో తొలి కార్తిక సోమవారం సందడి
- పోటెత్తిన భక్తులు

పిఠాపురం: కార్తికమాసం మొదటి సోమవారం స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పాదగయలో పుణ్యస్నానాలు చేసి శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మంటపంలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. పాదగయ పుష్కరిణి నీటితో పాదగయ క్షేత్రంలో శివ లింగాలకు భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. కార్తిక సోమవారం సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు. సాయంతం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో వివిధ గ్రామాల్లో ఉన్న శివాలయాలు శివన్నామస్మరణతో మారుమోగగా భక్తులు పోటెత్తారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కొత్తపల్లి : మండల పరిధిలో ఉన్న అన్ని ఆలయాలు కార్తిక మాసం మొదటి సోమవారం కావడంతో శివ నామస్మరణతో మార్మోగాయి. అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామి , శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాల స్వామి, శ్రీధర్మశాస్తా, ఉప్పాడలో ఉన్న చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, బలభద్రసమేత మల్లేశ్వరస్వామి, మత్స్యలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు మూలపేట, గోర్స తదితర గ్రామాల్లో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి, ఎండపల్లిలో ఉన్న మాణిక్యాంబ సమేత కరకంఠేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు రావిచెట్టు, ధ్వజస్తంభాల వద్ద ఆవు నేయితో తయారు చేసిన దీపాలను వెలిగించి పూజలు చేశారు. కొత్తపల్లిలో ఉన్న రుక్మిణీ సత్యబామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మహిళలు విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు.


పాదగయ పుష్కరిణిలో కార్తిక దీపాలు వదులుతున్న భక్తులు

పంచారామ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

సామర్లకోట: కార్తిక మాసం మొదటి సోమవారం కావడంతో స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి దర్శనానికి తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున 3 గంటలకు గోపూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయంలో భక్తులు లక్షపత్రి పూజలు చేసుకున్నారు.


సామర్లకోట పంచారామ క్షేత్రంలో గోపూజ చేస్తున్న భక్తులు

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన

కార్తిక మాసం సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన అందరినీ ఆకట్టుకుంది. ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్న వారి కోసం దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చనను ఏర్పాటు చేశారు. ఆలయ ధ్వజ స్తంభం, మారేడు చెట్టు, జమ్మి చెట్టు, తులసి మొక్కల వద్ద భక్తులు దీపాలను వెలిగించారు. ట్రస్టు బోర్డు సభ్యులు యందమూరి వెంకట్రావు, నాతిపాముల సూరిబాబు, చల్లా కుమారి, కర్రి వెంకటలక్ష్మి తదితరులు భక్తులకు సేవలందించారు.


పంచారామ క్షేత్రంలో ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కాండ్రకోటలో సోమవారం నిర్వహించిన ×వై ఏపీ నీడ్స్ జగన్‌Ò కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో ఇంటింటికీ లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రతిఒక్కరూ గుర్తించి మళ్లీ వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలకాలని కోరారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమం, అభివృద్ధి తెలిపే బోర్డును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెంకే సత్యవతి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, గోపు మురళి, యినకొండ వీర విష్ణుచక్ర, ఉప సర్పంచ్ జోకా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: సంక్షేమాభివృద్ధి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సామర్లకోట నీలమ్మ చెరువు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండగగా మార్చి రైతును రాజుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయ ఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానికుడైన తనకు పెద్దాపురం ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని, తనను ప్రతీఒక్కరూ ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కౌన్సిలర్లు చిట్టుమాని రాఘవ, నమ్మి దుర్గ భవాని, పెండ్యాల వెంకటలక్ష్మి, వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్రరావు, జట్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని జి.మేడపాడులో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలోనూ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు.


కాండ్రకోటలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న దొరబాబు


కొత్తపల్లిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎంపీపీ దొరబాబు


సామర్లకోటలో లబ్ధిదారుల జాబితా బోర్డును ఆవిష్కరించిన దవులూరి దొరబాబు

అభివృద్ధి జరగాలంటే జగనే కావాలి

పిఠాపురం: పేదల బతుకులు మారాలంటే ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగలోవరాజు అన్నారు. గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర పార్టీ జెండాను ఆవిష్కరించగా గ్రామ సచివాలయం - 1లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో ఉన్న బోర్డును ఆత్మ చైర్మన్ కడింశెట్టి భాస్కరరెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ అరిగెల మణిబాబు, పుప్పాల బాబులు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మణుగుల వీరభద్రం, ఇతర నాయకులు ఆవిష్కరించారు. ప్రతీ ఇంటికి వెళ్లిన నాయకులు ఆయా గృహాల వద్ద పార్టీ జెడాను ఆవిష్కరించి జగనే ఎందుకు కావాలో ప్రజలకు వివరించారు. గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.


ఏకే మల్లవరంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవరత్నాలతో సంక్షేమ కాంతులు

కొత్తపల్లి: నవరత్నాలతో ప్రతి కుటుంబం వెలుగులు సంతరించుకుందని వైస్ ఎంపీపీ మదిరెడ్డి దొరబాబు పేర్కొన్నారు. స్థానిక సచివాలయం వద్ద సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులకు, సచివాలయ కన్వీనర్‌లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ నెరవేరుస్తున్నారన్నారు. జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, నాడు-నేడు వంటి అనేక పథకాలతో ప్రజా రంజక పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నను గెలిపించాలని కోరారు. సర్పంచ్ గవర భవాని, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్, గవర నాగేశ్వరరావు, కాపుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలు

పిఠాపురం: పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆలయంలో గోపూజ, శ్రీపాద అష్టోత్తర శతనామావళి కార్యక్రమం నిర్వహించారు. పిఠాపురానికి చెందిన భక్తుల బృందం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొని శ్రీపాద అష్టోత్తర శతనామావళి ఆలపించారు. సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలలో భాగంగా నియోజకవర్గంలో పలు గ్రామాల్లో వారం రోజుల పాటు అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో సనాతన ధర్మం విలువ తెలియజేసేలా ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో భక్తి భావం పెంపొందించడానికి ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె అన్నారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్ధనరావు, భక్తులు పాల్గొన్నారు.


గోపూజ చేస్తున్న మహిళలు

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

పెద్దాపురం: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, డివిజన్ పరిధిలోని అర్హత లేని వైద్యులు ఎవరైనా స్కానింగ్ సెంటర్లు నడిపితే సంబంధిత వైద్యులపై కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి ఎస్‌డీఎల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ సరితలు మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా జిల్లా వైద్యాధికారి అనుమతి పొందాలన్నారు. స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ సమాచారాన్ని చట్ట ప్రకారం బహిర్గతం చేయకూడదన్నారు. డివిజన్‌లో ఉన్న అన్ని స్కానింగ్ సెంటర్లపై ప్రతీ మూడు నెలలకోసారి కమిటీ తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్లు కందుల వెంకటాచలం, సత్య రవికుమార్, వైద్యులు మనంద్‌చంద్ర, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జేఎస్ రామారావు

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

పెద్దాపురం: పుస్తక పఠనంతో నిరంతర జ్ఞానసముపార్జన సాధ్యమని పెద్దాపురం మహారాణి కళాశాల ప్రిన్సిపాల్ టి.వీరయ్య చౌదరి అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పుస్తకంతో మంచి మిత్రుడితో సమానమన్నారు. అనంతరం వక్తృత్వం, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జ్యోస్యుల కృష్ణబాబు, అభ్యుదయ కవి చల్లా విశ్వనాథం, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: గ్రంథాలయాలు వృద్ధులు, దివ్యాంగులతో పాటు అందరికీ అందుబాటులో ఉండాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం అద్దె భవనం రెండో అంతస్తులో ఉండటం వల్ల వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయానికి పట్టణంలో స్థలం కేటాయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, గొంకిన సునేత్రాదేవి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, కౌన్సిలరు పిట్టా సత్యనారాయణ, గ్రంథాలయాధికారి బందిల రత్నమణి పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్య అతిథులు


పీబీ దేవంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ సూరిబాబు

మండలంలోని వేట్లపాలెం గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఎంపీటీసీ పాలచర్ల సతీష్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు ఝాన్సీ, చౌదరి, దుర్గాదేవి ఆటల పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పీబీ దేవంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు ఎంపీటీసీ మలకల సూరిబాబు బహుమతులు అందజేశారు.


సామర్లకోటలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దొరబాబు


ఉప్పాడలో బహుమతి అందుకుంటున్న విద్యార్థి

ఘనంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కొత్తపల్లి: మండల పరిధిలో ఉన్న ఉప్పాడ, కొత్తపల్లిలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. గ్రంథాలయ అధికారులు టి.నళినీప్రియ, తుమ్మలపల్లి జయకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు బి.వేణుగోపాల్, పైడిరాజు హాజరయ్యారు. చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాసరచన, కథలు రాయడం, చెప్పడం వంటి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ పాల్గొన్నారు.

కాజ్‌వేకు నిధుల మంజూరు


వీకే రాయిపురం ఏలేరు కాలువ వద్ద శిథిలమైన కాజ్‌వే

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: మండల పరిధిలోని వీకే రాయపురం ఏలేరు కాలువలోని కాజ్‌వే మరమ్మతులకు జిల్లా కలెక్టరు కృతికా శుక్లా రూ.1.43 లక్షల నిధులు మంజూరు చేశారు. శిథిలమైన కాజ్‌వేతో రైతుల ఇక్కట్లు అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కలెక్టరు స్పందించారు. రైతు సంఘ నాయకులు సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంతో కలెక్టరును సోమవారం కలిశారు. దాంతో తాత్కలిక మరమ్మతులకు నిధులు మంజూరు చేయడానికి అంగీకరించారు. కాజ్‌వే మరమ్మతుల పనులను రైతులు స్వయంగా చేయించుకోవాలని కలెక్టరు సూచించారు. కలెక్టర్‌ను కలిసినవారిలో రైతు సంఘ నాయకులు కుర్రా శ్రీనివాస్, వెలమర్తి బుల్లిరాజు, ఇంటి వెంకట్రావు, వెలమర్తి శ్రీనిదాసులు ఉన్నారు.

రైతు కూలీల ధర్నా

పెద్దాపురం: జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో సీలింగ్ భూములను పెత్తందారులకు కట్టబెట్టే ప్రయత్నం మానుకోవాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా తమ సాగులో ఉన్న భూముల్లో హెచ్చరిక బోర్డులు తొలగించి, సాగులో ఉన్న తమకే పట్టాలివ్వాలన్నారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుంచే అంజిబాబు, మంగాదేవి, డి.సురేష్, చార్లెస్, సత్తిబాబు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో దీపారాధన


సామర్లకోట రామాలయంలో కార్తిక దీపాలు వెలిగించిన భక్తులు

సామర్లకోట: స్థానిక 13వ వార్డు బలుసులపేట రామాలయంలో కార్తిక మాసంను పురస్కరించుకుని అన్నవరం దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కార్తిక దీపారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నేతల హరిబాబు, హిందూ ధర్మరక్ష సమితి సభ్యులు జీవీకే మోహనరావు, అర్జునరావు, కర్రి ఆదినారాయణరెడ్డి, గంధం రామకృష్ణ, కేవీ సుబ్బారావు పాల్గొని దీపాలు వెలిగించారు.

సబ్ జూనియర్స్ తైక్వాండోలో పతకాల పంట

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గుంటూరులో ఈ నెల 18, 19 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ తైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు ప్రతిభను కనపరచి పలు విభాగాల్లో పతకాలు సాధించారని సంఘ కార్యదర్శి బి.అర్జునరావు తెలిపారు. ఈ పోటీల్లో 14 బంగారు, 7 రజత, 15 కాంస్య పతకాలు జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. ఓవరాల్ చాంపియన్ షిప్ విభాగంలో తూర్పు జట్టు ద్వితీయస్థానంలో నిలిచిందన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్, తైక్వాండో సంఘ అధ్యక్షుడు మధుసుదనరావు అభినందించారు.